
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com

**20 గదులు.. రూ.2.80 కోట్లు**



2



2

**జీజీహెచ్‌లో కలకలం.. బాలుడి కిడ్నాప్**

## నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ అభివృద్ధికి కార్యాచరణ



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు వెళ్తామని ఈడీ సోలమన్ పేర్కొన్నారు. నగరంలోని ఆర్ఎం కార్యాలయంలో శనివారం రీజియన్ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. రీజియన్ పరిధిలోని డిపోల పనితీరును పరిశీలించారు. డిపో మేనేజర్లతో సమావేశమై వారి పనితీరును, డిపో నిర్వహణను, నిర్దేశించిన అంశాల పురోభివృద్ధిపై మాట్లాడారు. డిపోల పనితీరును మరింత మెరుగుపర్చి, ప్రయాణికులకు సురక్షితమైన ప్రజారవాణా సేవలు అందించాలని సూచించారు.





**ఇందిరాపార్క్ దీక్షకు తరలిన బీజేపీ శ్రేణులు..**

–మిగతా ఫొటోలు 2వ పేజీలో..





## ఉపాధికి 'హామీ' ఇస్తూ..

# ప్రగతికి బాటలు వేస్తూ..

**మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. పాత జాబ్ కార్డుల స్థానంలో మూడేళ్ల కాలపరిమితితో నూతన 'గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డుల'ను అందజేస్తుంది. ఇందులో మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు, గిరిజన తెగలకు ప్రాధాన్యం ఇస్తూ వేర్వేరు రంగుల్లో ప్రత్యేక కార్డులను జారీ చేస్తున్నారు.**

**– భీమ్‌గల్, అక్షరటుడే**

- **జిల్లాలో జోరుగా ఉపాధి పనులు**
- **పనుల్లో వేగం.. వేతనాల్లో పారదర్శకత..**
- **కూలీలు సైతం మొగ్గు చూపుతున్న వైనం..**

ఉపాధి హామీ పనులతో గ్రామీణ ప్రజలకు కూలి అందడంతో పాటు పలు అభివృద్ధి పనులు సైతం సాగుతున్నాయి. పనిచేసిన కూలీలకు అలసత్వం లేకుండా 15 రోజుల్లోగానే వారి బ్యాంక్ ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తున్నారు. వేతనం చెల్లింపులో 16వ రోజు నుంచి ఆలస్యమైతే చట్ట ప్రకారం పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాకుండా నిర్ణీత గడువులోగా పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి చెల్లించాలనే నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నారు. దీంతో పనులు చేయడానికి కూలీలు సైతం ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుత అధికారిక పోర్టల్, క్షేత్రస్థాయిలో సమాచారం ప్రకారం.. నిజామాబాద్‌లో 2,42,150 జాబ్ కార్డులు ఉండగా.. 4,85,300కూలీలు ఉన్నారు. కామారెడ్డి జిల్లాలో 2,15,400 కార్డులుండగా.. 4,12,200 మంది కూలీలు పనిచేస్తున్నారు.

**శాశ్వత ఆస్తుల రూపకల్పన..**

పథకం కింద యంత్రాలు, కాంట్రాక్టర్ల జోక్యానికి తావులేకుండా కేవలం కూలీలతోనే పనులు చేపడుతున్నారు. వర్షాకాల పరిస్థితులు, నీటి ఎద్దడి నివారణను దృష్టిలో ఉంచుకుని చెక్‌డ్యామ్‌లు, ఇంకుడుగుంతలు, చెరువుల పునరుద్ధరణ పనులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలు, పశువుల షెడ్ల వంటి శాశ్వత నిర్మాణాలను చేపడుతున్నారు. దీంతో కూలీలు సైతం దండిగా పని దొరికినట్లయ్యింది. వారి సైతం ఇతర పనులకు వెళ్లకుండా కేవలం ఉపాధి పనులకే వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు.



## రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న భవాని

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న భవానీ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్రం నుంచి ఈ అవార్డు అందుకున్న ఏకైకవ్యక్తిగా భవాని నిలిచింది. విద్యార్థుల్లో పాఠాలు వినూత్న తరహాలో ఆడుతూ పాడుతూ నేర్పించడం భవానీకి వెన్నతో పెట్టిన విద్య. దీంతో పాఠశాలకు విద్యార్థులు వచ్చేందుకు మక్కువ చూపుతున్నారు. అంతేకాకుండా భవానీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా యూట్యూబ్ ఛానల్‌ను నిర్వహిస్తూ విద్యార్థులతో తాను కూడా పాల్గొని సులభరీతిలో బోధన చేస్తున్నారు.

## పారదర్శకంగా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలి



**అక్షరటుడే, కామారెడ్డి :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శనివారం కామారెడ్డి పురపాలక సంఘం పరిధిలోని పోలింగ్ కేంద్రం నంబర్ 262 పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఓటర్ల వివరాల్లో సవరణలు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి ప్రక్రియలను ఎన్నికల నిబంధనల మేరకు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రవి తేజ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, సూపర్‌వైజర్ అధికారులు, వార్డు అధికారులు, బూత్ స్థాయి అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లో ఆయన అధికారులతో సమీక్షించారు. సెప్టెంబర్ 14 నుంచి 24 వరకు ఉత్సవాలు, 24న నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో నీటి లోతును గుర్తించి ప్రమాదాలు జరగకుండా పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, వైద్య, అగ్నిమాపక శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు.



## వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, యువతకు అన్యాయం..

**అక్షరటుడే, కామారెడ్డి:** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీల మోసాలపై బీఆర్ఎస్ పార్టీ పోరుబాటలో భాగంగా శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల గ్రౌండ్ నుంచి బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగం కామారెడ్డి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీలో పాల్గొన్న గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు వాటి అమలులో ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, కాలేజీ విద్యార్థినులకు ఉచిత స్కూటీ, అర్హులైన నిరుద్యోగ యువతకు ప్రతి నెల రూ. 4వేల నిరుద్యోగ భృతి, అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి హామీల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. జీవో నంబర్ 97 పేరుతో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆశలను అడియాశలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మెడలు వంచైనా విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చేస్తామని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి నిరంతర పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంప శశాంక్, ఎంకే ముజీబుద్దీన్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కాసర్ల గోదావరి స్వామి, చెలిమెల భాను ప్రసాద్, మాజిద్, అనిల్ రెడ్డి, రంజిత్ వర్మ, శేఖర్, రజినీకాంత్, లష్కర్ దేవరాజు, ప్రభాకర్ రెడ్డి, సాయి పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**అక్షరటుడే, కామారెడ్డి :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కామారెడ్డి జిల్లా శాఖ పిలుపునిచ్చింది. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం నాయకులు మాట్లాడారు. తమ న్యాయమైన హక్కుల కోసం ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు, పెన్షనర్ తప్పక హైదరాబాద్ కు తరలిరావాలని కోరారు. కామారెడ్డి జిల్లా నుండి సుమారు 5 వేల మంది తరలివెళ్తామని తెలిపారు. ఇది ప్రజాస్వామ్య ఉద్యమమని, ప్రతి ఒక్కరు కదలాలి.. మన గొంతు ప్రభుత్వానికి వినిపించాలి అనే నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. అన్ని శాఖల అధిపతులు ఆ రోజు సెలవు మంజూరులో ఇబ్బంది పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ఛైర్మన్ దేవేందర్, కుషాల్, ఆకుల బాబు, ప్రవీణ్ కుమార్, చింతల లింగం, బషీర్, శ్రీనివాస్, ఖలీముద్దీన్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి : సీపీ



**అక్షరటుడే, ఆర్మూర్ :** గణేష్ చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. ఆర్మూర్‌లో గణేష్ చవితి పండుగను పురస్కరించుకొని శాంతి కమిటీ సమావేశాన్ని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతమైన, సోదరభావంతో కూడిన శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ అనేది ప్రజలందరినీ ఐక్యం చేసే కార్యక్రమమని, ప్రతిఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ మత సామరస్యాన్ని కాపాడాలని కోరారు. గణేష్ మండపాల నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతులు తీసుకోవడంతో పాటు, పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ తెలిపారు. మండపాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్, పార్కింగ్, జనసందోహం నియంత్రణకు నిర్వాహకులు ప్రత్యేకంగా సహకరించాలని తెలిపారు. మండపాల వద్ద డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో ప్రభుత్వం నిర్దేశించిన శబ్ద పరిమితులు, సమయ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్నాన్ మాల్వియా, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కాటేపల్లి వెంకట్ రెడ్డి, ఆర్మూర్ ఎస్సై రజనీకాంత్, బాల్కొండ ఎస్సై శైలందర్, మెండోరా ఎస్సై సుహాసిని, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, గణేష్ మండళ్ల నిర్వాహకులు, ఆర్గనైజర్లు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ధర్నా

**అక్షరటుడే, బోధన్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బోధన్ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జి అయేషా ఫాతిమా మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులపై కక్ష సాధించే విధంగా ప్రవర్తిస్తోందన్నారు. విద్య శాఖ సీఎం వద్ద ఉన్నా కూడా విద్యార్థులకు ఎందుకు న్యాయం చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు రావాల్సిన దాదాపు రూ.13,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదన్నారు. విద్యార్థులే రాష్ట్ర అభివృద్ధికి కీలకమని.. అలాంటి విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదని అయేషా ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ భారీ బైక్‌ర్యాలీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కాంగ్రెస్ వైఫల్యాలను నిరసిస్తూ నగరంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా నేతృత్వంలో ఈ ర్యాలీ నిర్వహించారు. పాత కలెక్టర్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ పూలాంగ్ ఎక్స్ రోడ్, వర్ని ఎక్స్ రోడ్, ఖిల్లా ఎక్స్ రోడ్, పవన్ టాకీస్ రోడ్, నెహ్రూ పార్క్, బస్టాండ్ మీదుగా సాగి పాత కలెక్టర్ గ్రౌండ్ వద్ద ముగిసింది. బిగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటం మరింత ఉధృతం చేస్తామన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఆరు గ్యారెంటీలు, 420 హామీలిచ్చి ప్రజలను తీవ్రంగా మోసం చేసిందని బిగాల మండిపడ్డారు. కాంగ్రెస్ పాలన అట్టర్ ఫ్లాప్‌గా మారిందని, ప్రజా సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని విమర్శించారు. ఏ ప్రభుత్వానికైనా సర్దుబాటు చేసుకునేందుకు కొంత సమయం ఇవ్వాలనే ఉద్దేశంతో కేసీఆర్ వేచి చూశారని, అయితే ప్రజా సమస్యలు తీవ్రమవుతుండటంతో పోరాట బాట పట్టక తప్పలేదన్నారు. మహిళలు, రైతులు, నిరుద్యోగుల తరఫున బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తోందని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ వంటి హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, నిరుద్యోగ యువతకు వెంటనే స్పష్టమైన భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్



శేఖర్, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్, సుజిత్ సింగ్, గాండ్ల లింగం, చింతకాయల రాజు, నవీద్ ఇక్బాల్, జగత్ రెడ్డి పాల్గొన్నారు.

## ‘ఖబడ్దార్ జీవన్‌రెడ్డి.. నోరు అదుపులో పెట్టుకో..’



**అక్షరటుడే, ఆర్మూర్:** మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆలూర్ మండల కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం ఆలూర్‌లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేగాం ప్రమోద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జీవన్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. ఆలూర్ మండలంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కనీస వాస్తవాలు తెలుసుకోకుండా జీవన్‌రెడ్డి ఇష్టారాజ్యంగా మాట్లాడటం సరికాదన్నారు. ఖబడ్దార్ జీవన్‌రెడ్డి.. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. ఆలూర్ మండలంలో 427 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, 9,200 గృహజ్యోతి కనెక్షన్లు అమలులో ఉన్నాయని, 1,800 నూతన రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. మల్లారెడ్డి, ఉదయ్, నిలగిరి శ్రీనివాస్, శశి,ప్రవీణ్, శివ, ప్రభాకర్, సునీల్, గంగారెడ్డి, ముత్యం రెడ్డి, సమీర్ పాల్గొన్నారు.

## మహా పాదయాత్ర ప్రారంభం



**అక్షరటుడే,కోటగిరి:** శ్రావణమాసం సందర్భంగా హంగర్గ గ్రామం నుంచి భక్తులు పాదయాత్ర ప్రారంభించారు. బైరాపూర్ విఠలేశ్వర మందిరం, తిమ్మాపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు భక్తులు మహా పాదయాత్ర నిర్వహించారు. పోతంగల్ మండలం హంగర్గ గ్రామం నుంచి ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది దొండు మహారాజ్, తులసీరామ్ మహారాజ్ ఆధ్వర్యంలో శనివారం పాదయాత్ర కొనసాగింది. కేలూర్ హన్మండ్లు మహారాజ్, మరాఠీ, భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ, గ్రామ పెద్దలు చిన్న పిల్లలు మహిళలు, యువకులు, భక్తి గీతాలు ఆలపిస్తూ మహా పాదయాత్రను కొనసాగించారు. అనంతరం భక్తులకు, మార్గమధ్యలో అల్పాహారం,అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

## తండాల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**అక్షరటుడే,పెద్ద కొడప్‌గల్:** మండలంలోని లబానా తండాల్లో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగవైభవంగా జరిగాయి. శుక్రవారం ప్రారంభమైన ఈ వేడుకలు శనివారం సైతం కొనసాగాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి గ్రామ శివారులోని చేన్లకు వెళ్లి నల్లమట్టిని సేకరించి శ్రీ కృష్ణుడి ప్రతిమను తయారు చేసి ఇంటికి తీసుకువచ్చారు. ఇంట్లో సంప్రదాయ పద్ధతులో తయారు చేసిన తీపి పిండి వంటలు నైవేద్యంతో పెట్టి అర్ధరాత్రి కృష్ణుని జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం రోజు తండాలోని యువకులు కృష్ణుని ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సహంగా పాల్గొన్నారు. ప్రతి ఇంట్లో బాలాజీకి నెయ్యి గోధుమపిండితో తయారు చేసిన మాల్‌పూరితో బోగ్ బండర్ నైవేద్యం సమర్పించారు. తండాలోని నాయక్ ఇంట్లో ఖేల్‌కూద్ నృత్యాలు జరిగాయి.




కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న తీవ్ర వసతుల కొరతపై 'అక్షరటుడే' వరుస కథనాలు, విద్యార్థి సంఘాల ఆందోళనలతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. వెయ్యి మంది విద్యార్థులకు కేవలం పది గదులు మాత్రమే ఉండటం, షిఫ్ట్ పద్ధతిలో తరగతులు నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో, ఇప్పుడు వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధమైనట్లు తెలుస్తోంది.
– అక్షరటుడే, కామారెడ్డి

# 20 గదులు.. రూ.2.80 కోట్లు

- కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతులపై ప్రతిపాదనలు
- పాత భవనంపై, పక్కన ఓపెన్ స్థలంలో నిర్మాణం
- గదుల నిర్మాణాలు జరిగితే విద్యార్థులకు తప్పనున్న ఇబ్బందులు
- విద్యార్థులు, విద్యార్థి సంఘాల నిరీక్షణ ఫలించేనా..?

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతంలో 600 ఉన్న అడ్మిషన్లు ఈసారి వెయ్యికి పైగా చేరాయి. అయితే అంతమంది విద్యార్థులకు కేవలం 10 తరగతి గదులు మాత్రమే ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల షిఫ్టింగ్ పద్ధతిలో తరగతుల నిర్వహణకు కళాశాల యాజమాన్యం నిర్ణయించింది.

### కళాశాలలో వసతులపై ప్రతిపాదనలు..

గత విద్యా సంవత్సరంలో 600 ఉన్న అడ్మిషన్లు ఈ ఏడాది వెయ్యికి పైగా పెరిగాయి. దీంతో ఒక్కో తరగతి గదిలో 100 మంది విద్యార్థులు కూర్చోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా సుమారు రూ.2.80 కోట్ల వ్యయంతో 20 అదనపు తరగతి గదులు, తాగునీరు, ల్యాబ్, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన ఆమోదం పొందితే విద్యార్థుల ఇబ్బందులు తీరనున్నాయి.

### 20 గదుల నిర్మాణానికి మ్యాప్ రెడీ..

అదనపు గదుల నిర్మాణం విషయంలో స్థలాన్ని తక్కువగా వాడుకునేలా ప్రణాళిక సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఉన్న కళాశాల భవనంపై 10 గదులు, పక్కనే ఉన్న ఓపెన్ స్థలంలో మరో 10 గదులు నిర్మించాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. దీనివల్ల ప్రభుత్వానికి ఖర్చు తగ్గే అవకాశం ఉంది. ఒకవేళ మొత్తం 20 గదులు ఓపెన్ స్థలంలోనే నిర్మిస్తే అంచనా మరో రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు పెరిగే అవకాశం ఉంది. ఓపెన్ స్థలంలోనే నిర్మిస్తే ఆ గదులు ఎక్కువకాలం మన్నికగా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

### విద్యార్థులకు తప్పనున్న ఇబ్బందులు

ఈ 20 గదుల నిర్మాణం పూర్తయితే కళాశాల రూపురేఖలే మారనున్నాయి. షిఫ్ట్ విధానానికి తెరపడి, ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తిస్థాయిలో తరగతులు జరుగుతాయి.

### నిరీక్షణ ఫలించేనా..?

కామారెడ్డి జిల్లా కేంద్రం ఏర్పడి దాదాపు పదేళ్లయినా జూనియర్ కళాశాల పరిస్థితి ఇలాగే ఉంది. అడ్మిషన్లు పెరగడం, విద్యార్థి సంఘాల ఆందోళనల వల్లనే ఈ ప్రతిపాదనలు తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపితే ఆలస్యం లేకుండా నిధులు మంజూరు చేయించే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు. త్వరగా నిధులు మంజూరు చేయించి కళాశాల విద్యార్థుల నిరీక్షణకు ఫలితం దక్కేలా చూడాలని కోరుతున్నారు. నిర్మాణాలు త్వరగా పూర్తి చేస్తే వచ్చే మరిన్ని అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉంది.

### కొత్తగా ప్రతిపాదనలు నా వద్దకు రాలేదు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి ఇదివరకే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. ఈ మధ్య మళ్లీ ప్రతిపాదనలు చేసిన విషయం నా వరకు రాలేదు. కొత్తగా గదుల నిర్మాణం ఎలా చేస్తారనేది ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఇంజినీర్ల సలహాలు తీసుకునే నిర్మాణాలు జరుగుతాయి.
**– సలాం, ఇంటర్ నోడల్ అధికారి**

## ఓటరు సవరణకు సరైన గుర్తింపు పత్రాలు జతచేయాలి



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఆర్డీవో రాజేంద్రకుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నోటీసులు అందిన ఓటర్లు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సక్రమంగా జతచేసి అందించాలని సూచించారు. ఓటర్ల నుంచి తీసుకునే గుర్తింపు, ధ్రువీకరణ పత్రాలను అధికారులు, బీఎల్‌వోలు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆర్డీవో ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. తహశీల్దార్ సతీష్ రెడ్డి, ఇతర అధికారులు, బీఎల్‌వోలు ఉన్నారు.

## ముప్కాల్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా బడుగు సురేష్



**అక్షరటుడే, ముప్కాల్:** మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) అధ్యక్షుడిగా బడుగు సురేష్, ఉపాధ్యక్షుడిగా గద్దల శేఖర్ ఎన్నికైనట్లు నాయకులు తెలిపారు. అలాగే మూడు మండలాలకు సంబంధించి కీలక సభ్యులను కూడా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వారి జాబితాను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన నాయకులు ఎమ్మార్పీఎస్ బలోపేతానికి, మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



బాల్కొండ జెడ్పీహెచ్ఎస్‌లో..


ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలో..



లింగంపేట మండలం శెట్టిపల్లి ప్రాథమిక పాఠశాలలో..


లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో శంకర్ భవన్ పాఠశాలలో..

## గురు సాక్షాత్ పరబ్రహ్మ..

ఉపాధ్యాయ దినోత్సవానికి ఉమ్మడిజిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ..దేశానికి ఉపాధ్యాయులు దిక్సూచిలాంటి వారని పేర్కొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల బోధనలకు శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్

## జీజీహెచ్‌లో బాలుడి కిడ్నాప్ కలకలం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని జీజీహెచ్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. తాజాగా ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న మాతాశిశు ఆస్పత్రిలో బాలుడి కిడ్నాప్ ఉదంతం కలకలం రేపుతోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాల్కొండ మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు తమ ఇద్దరి పిల్లలతో జీజీహెచ్‌కు అనుబంధంగా ఉన్న మాతాశిశు ఆస్పత్రికి వచ్చారు. తల్లిదండ్రులు ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం వైద్యులతో మాట్లాడుతుండగా.. ఇద్దరు బాలురు ఆస్పత్రి ఆవరణలో ఆడుకుంటున్నారు. అయితే ఇద్దరిలో రెండున్నరేళ్ల చిన్నబాలుడిని ఓ మహిళ తీసుకెళ్లినట్లుగా అనుమానిస్తున్నారు. బాలుడి మిస్ అయ్యాడనే సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే 112కు కాల్ చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు ఈ ఘటనపై విచారణ చేస్తున్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఓ మహిళ బాలుడిని తీసుకెళ్తున్నట్లు సీసీ కెమెరాలో రికార్డు అయింది. దీంతో ఆమె కోసం గాలిస్తున్నారు.

## ఇందిరాపార్క్ దీక్షకు తరలిన బీజేపీ శ్రేణులు..

హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద దీక్షకు ఉమ్మడిజిల్లాల నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లాయి. రాష్ట్రంలోని రైతులు, అమాయకుల భూములను ప్రభుత్వం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురి చేయడం సరికాదని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఆ జాబితా నుంచి భూములను తొలగించేవరకు పోరాటం చేస్తామన్నారు.
– అక్షరటుడే, నెట్‌వర్క్


బాన్సువాడలో..


పెద్దకొడప్‌గల్‌లో..





ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు